ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 24 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 సహర్: 4:54
(సోమవారం సాయంత్రం) (మంగళవారం ఉదయం)

సత్యసాయి ట్రస్టు సేవలు అజరామరం
● సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ శ్వేత 7



సంగారెడ్డిలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ చెబుతున్న జగ్గారెడ్డి



ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డికి పండ్లు తినిపిస్తున్న మాజీ కౌన్సిలర్ షఫీయొద్దీన్

ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డి

ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ చెప్పిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని నాల్‌సాబ్‌గడ్డకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుత్బోద్దీన్ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి పండ్లు తినిపించి, వారికి ఈద్ ముబారక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, షఫీయొద్దీన్, తాహేర్‌పాషా, ఆరీఫ్, మసూద్, షాహీద్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

● జిల్లా వ్యవసాయ అధికారి రాధిక ● ఎన్సాన్‌పల్లిలో మొక్కజొన్న పంట పరిశీలన

సిద్దిపేటఅర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు, ఈదురుగాలుల ధాటికి పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను పంపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. ఆదివారం అర్బన్ మం డలం ఎన్సాన్‌పల్లిలో నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మొక్కజొన్న పం టను ఏవో శ్రీనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రాథమిక అంచనా మేరకు ఒక్క ఎన్సాన్‌పల్లిలోనే సుమారు 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగినట్టు పేర్కొన్నారు. అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి పంట నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక

మట్టి స్నానానికి మంచి స్పందన

సిద్దిపేటకల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో మడ్‌బాత్ ఆయుర్వేద మట్టి స్నాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సిద్దిపేటలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో ఇలా మట్టి స్నానం చేయడం వల్ల శరీరంలోని అనేక రుగ్మతలను దూరం చేస్తుందన్నారు. ప్రత్యేకమైనటువంటి మట్టిలో వివిధ రకాలైన ఔషధాలతో పాటుగా గోమూత్రము, పాలు, నెయ్యి, తులసి పౌడర్, పసుపు, వేప, నిమ్మ ఇలా దాదాపు 25 రకాల పౌడర్లు కలిపి ఒక మిశ్రమంగా తయారు చేస్తామని దీనిని ఒక లేపనంగా శరీరానికి వ్రాసుకుని సూర్యరశ్మిలో ఒక గంటపాటు ఉన్న తర్వాత స్నానం చేయవలసి ఉంటుందని అన్నారు. ఇలా చేయడం వల్ల శ్వేద గ్రంథులన్నీ తెరుచుకోబడి శరీరానికి చల్లదనం చేకూరుస్తాయని, రక్తప్రసరణ మెరుగవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ప్రభాకర్, పతంజలి యోగ చీఫ్ ప్యాట్రన్ అంజయ్య వ్యాసమహర్షి యోగా సభ్యు లు స్వామి, రాజమల్లు, రాజ్ కుమార్, సాయితేజ పాల్గొన్నారు.



మడ్‌బాత్ చేస్తున్న దృశ్యం

‘టీబీ’ కలవరం!

● చాపకింద నీరులా వ్యాపిస్తున్న ‘క్షయ’
● నేడే ‘ప్రపంచ క్షయ నివారణ దినం’ 7

తపాస్‌పల్లికి నీళ్లొచ్చేనా!?

● దేవాదుల ఫేజ్-3 మోటార్ల మొరాయింపు ● ఇప్పటికే పడిపోయిన నీటిమట్టంతో పంటనష్టం
● పంటలు ఎండుతుండడంతో అన్నదాతల ఆక్రందన



ప్రస్తుతం నీరులేక వెలవెలబోతున్న రిజర్వాయర్

చేర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు అడుగంటి చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ప్రస్తుతం అందరి దృష్టి కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌పై మళ్లింది. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు కొండపాక మండల రైతాంగం కోటిఆశలతో ఎదురుచూస్తుంది. జరిగిన పంటనష్టం పూడ్చలేనప్పటికీ కొద్దో, గొప్పో మిగిలిన పొలాలు కాపాడుకోవచ్చని భావిస్తున్నారు. గత ప్రభుత్వహయాంలో మండు వేసవిలోనూ రెండు పంపుల ద్వారా పంపింగ్ చేపట్టినప్పటికీ ప్రస్తుతం దేవాదుల అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయలోపంతో ఈసారి ఒక్కపంపు ద్వారానైనా నీటిని సక్రమంగా పం పింగ్ చేపట్టలేదు. దీంతో రిజర్వాయర్ ఆయకట్టు విస్తీర్ణం లో ఎన్నడూ లేనివిధంగా పంటనష్టం చవిచూడాల్సిన పరిస్థితి రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఎండగట్టిన ఎమ్మెల్యే పల్లా

రెండోదశ ద్వారా కింది ప్రాంతంలోని రిజర్వాయర్లన్నీ నింపిన తరువాతే తపాస్‌పల్లికి చేరుకునే క్రమంలో అక్కడి రాజకీయ ఒత్తిడి, ప్రమేయంతో తరుచూ ఆటంకాలు కలుగుతున్నాయి. ఆశించినన్ని రోజులు పంపింగ్‌కు నోచుకోక, విడుదల చేయని కారణంగా చెరువులు, కుంటలు ఎండిపోవడంతో బోర్లలో నీటిధార సన్నగిల్లింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో దేవాదుల వైఫల్యాన్ని ఎండగట్టారు. నిర్ణీత సమయంలో మోటార్లను నడిపించలేదని, వేతనాలందించకపోవడంతో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది సమ్మె చేపట్టినా పట్టించుకోలేదని, తద్వారా ప్రాజెక్ట్ పరిధిలో రూ.600కోట్ల నష్టంవాటిల్లిందని గళమెత్తారు. రైతాంగ దయనీయపరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

అధికారులకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి సూచన

నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా రైతాంగం ఆవేదనను గుర్తించిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దేవాదుల అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపారు. నష్టతీవ్రత, స్థానిక పరిస్థితుల కనుగుణంగా నీటిని విడుదల చేయాలని దేవాదుల అధికారులకు సూచించగా అక్కడక్కడా నీటిని అందించారు. తపాస్‌పల్లి, లద్నూరు, కన్నెబోయినగూడెం, బొమ్మకూరు తదితర రిజర్వాయర్‌లను నింపాలని మంత్రి ఉత్తమ్‌తో పాటు దేవాదుల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



ఎండిపోయిన పొలం

సమీక్షించిన భువనగిరి ఎంపీ చామల

సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇక్కడి సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. నీటి లభ్యత, పంపింగ్, ఇతరత్రా అంశాలపై దేవాదుల అధికారులతో ఆరాతీసి ప్రత్యామ్నాయ పంపింగ్ వనరులపై సమీక్షించారు. రంగనాయకసాగర్ కాలువ నుంచి చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లోని ఐదు గ్రామాల చెరువులకు నీటిని మళ్లింపచేశారు. థర్డ్‌ఫేజ్ ద్వారా రామప్పనుండి పంపింగ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించి ఇక్కడి పరిస్థితులు వివరించి కాస్త కదలిక తీసుకువచ్చారు.

థర్డ్ ఫేజ్‌తోనైనా మోక్షం కలిగేనా..!

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా దేవాదుల ప్రస్తావనతో సాగునీటినందించాలని చేసిన డిమాండ్‌తో పాటు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జరిపిన మంతనాలు, వినతులతో దేవాదుల థర్డ్ ఫేజ్ మోటార్లను ఇటీవల ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో గంగారం ఇన్‌టేక్‌వెల్ నుంచి కాకుండా రామప్ప నుంచి తపాస్‌పల్లితో పాటు నియోజకవర్గంలోని ఇతర రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తారని భావించారు. తద్వారా చివరి దశలో ఉన్న పంటలకు ప్రయోజనం కలుగుతుందని, రైతాంగం పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని ఆశించారు. కానీ పంపింగ్ కోసం మోటార్ల ప్రారంభించేందుకు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి తదితరులు హాజరైనా మోటార్లు మొరాయించడంతో ఆన్ చేయలేదు. దీంతో థర్డ్ ఫేజ్ ప్రారంభంపై నీలినీడలు కమ్ముకోవడంతో నిరాశ అలముకుంది. దీంతో తపాస్‌పల్లికి నీరందడం కష్టమేనని కలవరపడుతున్నారు.

వాటర్‌ట్యాంకర్లు... పశువులకు మేత...

ఎదుగుతున్న సమయంలో నీరందకపోవడంతో ఎండిన

మిగతా 8వ పేజీలో



నియోజకవర్గ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

● తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
● ఉగాది నుంచి సన్నబియ్యం
● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లోని ఐకేపీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో మాట్లాడారు. ఈ నియోజకవర్గం మూడు జిల్లాలతో ముడిపడి ఉందని, వేసవి దృష్ట్యా ఎక్కడా కూడా మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాత్కాలిక బావులు, బోర్లను తీసుకుని పైపులైన్ మోటర్లు బిగించి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఎల్కతుర్తి మండలం దామెరలో మంచినీటి సమస్య ఉండటంతో ధర్మసాగర్ నుంచి దామెరకు పైపులైన్ వేయడానికి తక్షణమే రూ.20లక్షలు మంజూరు చేశారు. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీవ్ యువవికాస పథకం గ్రామస్థాయి వరకు వెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేది

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జై బాపు, జై బీమ్, జై సంవిధాన్‌పై జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని, ఈ మూడు సూత్రాల మీద దేశం మొత్తం ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు టోపీలు పెట్టుకొని ప్రచార సామాగ్రి పట్టుకొని గ్రామాల్లో తిరగాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తితిరుపతిరెడ్డి, బంక చందు, నాయకులు చిత్తారి పద్మ, చిత్తారి రవీ, ధర్మయ్య, బస్వరాజు సారయ్య పాల్గొన్నారు.

40 లక్షల తాటి, ఈత మొక్కల పెంపకం

జూన్ తరువాత రాష్ట్రంలో 40 లక్షల తాటి, ఈత మొక్కల పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్‌లో గౌడ కులస్థులకు కాటమయ్య రక్షక కవచాలు పంపిణీ చేసిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో 300, రెండవ దశలో 500 కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న నీరాకేఫ్‌ను టూరిజం నుంచి గీతా పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగించామన్నారు. అనంతరం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏసీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఆయన వెంట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి రాజు, గౌరవ అధ్యక్షులు చొల్లేటి శంకరయ్య, నీరుమల్ల నాగరాజు, బబ్బుల రవీందర్, జిల్లా వనజ, చొల్లేటి లత, గౌరిశెట్టి సునిత,ఆర్యవైశ్య యువజన విభాగం నాయకులు బెజుగం సంతోష, సందీప్, సొల్లెటి శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్

● కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే పంటలు ఎండుతున్నది
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి); కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అడుగడుగునా దగా చేస్తుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలతో, వడగళ్ల వానతో చాలా గ్రామాల్లో వందల ఎకరాలో పంట నష్టం జరిగిందని, నష్టం వివరాలను నమోదు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో చాలా విషయాలు రైతుల కోసం చెప్పారు కానీ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ గురించి గొప్పలు పలికి.. అసెంబ్లీలో రూ.2లక్షల రుణమాఫీ గురించి మాట్లాడడం లేదన్నారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం.. వానాకాలం, యాసంగి రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండుతున్నది ఎండల వల్ల కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల అని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పోయిన యాసంగి, వానాకాలం, ఇప్పుడు యాసంగి మూడు పంటలకు కూడా బీమా రాలేదు.రైతులకు రూపాయి సాయం జరగలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.10 వేల ఇవ్వామని మంత్రి తుమ్మల చెప్పడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడేవి అన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. ఒక్కపైసా ఇవ్వకున్నా ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని ఆత్మస్థైర్యాన్ని అందించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి పరశురాంరెడ్డి, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కిక్కిరిసిన కొమురవెల్లి

● చివరివారం భారీగా తరలివచ్చిన భక్తులు



క్యూలో బారులు తీరిన భక్తులు

చేర్యాల/జగదేవ్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వేలాదిమంది భక్తులతో జనమయమైంది. మల్లన్న మూడునెలల జాతరలో భాగంగా చివరివారం కావడంతో పాటు అగ్నిగుండాలను తిలకించేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరి పీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి పర్యవేక్షణలో సాయంత్రం ఆలయ ఆవరణలోని తోటబావి ప్రాంగణంలో వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజలు నిర్వహించగా అర్ధరాత్రి అగ్నిగుండాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్‌లో కొండపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించు కుని పూజలు నిర్వహించారు. ఆదివారం చివరివారం కావడంతో ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మను దర్శించుకుని అమ్మవారికి బోనం సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శివ్వంపేట/సంగారెడ్డి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొంతాన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2011-12లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

డంపుయార్డు దిగులుతో
ఆగిన గుండె



రిలేదీక్షలో కృష్ణ (ఫైల్)

గుమ్మడిదల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయ్యవద్దని కోరుతూ మనోవేదనకు గురైన ఓ వ్యక్తి గుండె ఆగిపోయింది. ఈ సంఘటన ఆదివారం నాడు నల్లవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ప్రకారం గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన నడిమింటి కృష్ణ (53) గుండెతోపోటుతో మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా మృతుడు డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురుకు ఈ మధ్యనే పెళ్లి కుదిరినట్లు తెలిసింది. కాగా డంపు యార్డు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో తనకున్న కొద్ది పొలంతో ఎలాంటి లాభం రాదని మనవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో డంపు యార్డు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో రజక సంఘం తరఫున రిలే నిరాహార దీక్షలో సైతం పాల్గొన్నాడు. ఈ విషయమై ఆదివారం ఉదయం రోదిస్తు ఉండగా ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో కుటుంబీకులు అతడిని హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రభుత్వం బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ప్రియుడితో కలిసి భర్త హత్యకు ప్లాన్

- కారుతో ఢీకొట్టి చంపేందుకు యత్నం
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన భర్త



పోలీసుల అదుపులో నిందితులు

మునిపల్లి, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడిపై మోజుతో భర్తనే హత్య చేసేందుకు ప్లాన్ చేసింది ఓ భార్య. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి పెద్ద గోపులారం గ్రామానికి చెందిన కొంషట్‌పల్లి రవి వ్యక్తి ఝరా సంగం మండలం దౌరంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2021లో సంగారెడ్డికి చెందిన హరితను వివాహం చేసుకున్నాడు. హరిత చదువుకుంటున్న సమయంలో సంగారెడ్డికి చెందిన క్లాస్‌మెట్ మిరుదొడ్డి సాయిప్రదీప్‌ను ప్రేమించింది. రవితో పెళ్లి అయినప్పటికీ ఆమె సాయిప్రదీప్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశంతో రవిని హతమార్చేందుకు ప్రియుడు సాయిప్రదీప్‌తో కలిసి ప్లాన్ చేసి సరైన సమయం కోసం ఎదురు చూసింది. రవి రోజు మాదిరిగా శనివారం దౌరంపల్లి గ్రామంలో విధులు ముగించుకొని రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే అదునుగా భావించిన సాయిప్రదీప్ తన స్నేహితుడైన సాయికిరణ్‌తో కలిసి థార్ కారుతో వెంబడించారు. పెద్దగోపులారం చౌరస్తాలోని ఆశ్రమం వద్దకు రాగానే కారుతో రవిని ఢీకొట్టారు. ప్రమాదాన్ని పసిగట్టిన రవి వెంటనే తప్పించుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కంకోల్ టోల్‌ప్లాజా వద్ద నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. తమ సంబంధానికి అడ్డు తొలగించుకోవాలనే భార్య మార్గదర్శకంలో రోడ్డు ప్రమాదంలో రవిని అంతమొందించేందుకు యత్నించామని వారు అంగీకరించారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు హరిత, సాయిప్రదీప్, సాయికిరణ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



హత్యాయత్నానికి వినియోగించిన కారు



'టీబీ' కలవరం!

అప్రమత్తత అవసరం

● చాపకిందనీరులా వ్యాపిస్తున్న 'క్షయ'
● మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు
● రోగులకు నిలిచిన నగదు జమ
● నేడే 'ప్రపంచ క్షయ నివారణ దినం'

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : క్షయ(టీబీ) వ్యాధిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణానికే ప్రమాదం. దగ్గు రూపంలో ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి నిదానంగా ప్రాణాలనే బలి తీసుకుంటుంది. సంగారెడ్డి జిల్లాలో ఏటా క్షయ వ్యాధితో సుమారు 60 మంది వరకు మరణిస్తున్నట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నేడు 'ప్రపంచ క్షయ నివారణ దినం' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పెరుగుతున్న కేసులు

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో క్షయ కేసులు ఏటా పెరుగుతున్నాయి. ఇందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన గణాంకాలే నిదర్శనం. సంగారెడ్డి జిల్లాలో 2018లో 1476 కేసులు, 2019లో 1798 కేసులు, 2020లో 1692 కేసులు, 2021లో 1702 కేసులు, 2022లో 2359 కేసులు, 2023లో 2361 కేసులు, 2024లో 2386 కేసులు, 2025లో ఇప్పటి వరకు సుమారు 350 వరకు క్షయ కేసుల నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే సిద్దిపేట జిల్లాలో 2100 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. ఇందులో 40 మొండి క్షయ కేసులున్నట్లు గుర్తించారు. వైద్యులు సూచించిన విధంగా మందులు వాడుతూ నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే 6 నుంచి 12 నెలల్లో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంటుంది. ప్రత్యేక ట్రీట్‌మెంట్ యూనిట్లతో పాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట మెడికల్ కళాశాలలో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన సీబీ న్యాట్ పరీక్షతో కేవలం రెండు గంటల్లో వ్యాధిని నిర్ధారించే వీలుంది.

రోగి ఖాతాలో జమ కాని నగదు

సర్కారు 'నిక్షయ్ పోషన్ యోజన' కింద పౌష్టికాహారం కోసం ప్రతి నెలా క్షయ రోగికి రూ.1000 ఖాతాలో జమ చేస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విడుదలవుతాయి. వాటిని జిల్లా కలెక్టర్ అనుమతితో సంబంధిత రోగి ఖాతాలో నేరుగా జమ చేస్తారు. అయితే గత మూడు నెలలుగా నిధుల జమ కావడం లేదని రోగులు పేర్కొంటున్నారు. బడ్జెట్ లేని కారణంగా నగదు జమ నిలిచినట్లు అధికార వర్గాలు వివరించాయి. సిద్దిపేట జిల్లాలో మాజీ మంత్రి, హరీశ్‌రావు టీహెచ్‌ఆర్ పేరిట న్యూట్రిషన్ కిట్లను అందజేస్తూ బాసటగా నిలుస్తున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు

- రెండు వారాలకు మించి దగ్గు రావడం
- సాయంత్రం వేళలో జ్వరం రావడం
- రాత్రి వేళ జ్వరం, చెమటలు రావడం
- దగ్గుతున్నప్పుడు రక్తం పడడం
- ఆకలి లేకపోవడం, అలసట-నీరసం
- ఛాతినొప్పి, బరువు తగ్గడం



నీరుగారుతున్న సర్కారు లక్ష్యం

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపడుతుంటే, క్షయ నివారణకు క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల పట్టింపులేక జిల్లాలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తూన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాణాంతక వ్యాధిపై సంబంధిత క్షయ నివారణ విభాగం అధికారులు, వైద్య సిబ్బంది తమకు కేటాయించిన డివిజన్లు, ఏరియాల్లో పర్యవేక్షణ చేయాల్సి ఉండగా, జిల్లా కేంద్రానికే పరిమితమవుతూ అలసత్వంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్నాయి. దేశంలో క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా పారదోలాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందు కోసం అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలు సమకూర్చింది. ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులు పంపుతున్నది. కానీ క్షయ వ్యాధిని పూర్తిగా పారదోలడానికి మాత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నది. కాగా, జిల్లాలో క్షయ నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి జిల్లా క్షయ నివారణ అధికారి(డీటీసీవో) డా.అరుణకుమారి తెలిపారు.



త్రిశూల్ దీక్షలో పాల్గొన్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యం

● వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రామ్‌సింగ్

సంగారెడ్డి అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యమని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రామ్‌సింగ్, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు. సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురంలో బజరంగ్‌దళ్-విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ భారతీయ వైభవాన్ని ప్రపంచ దేశాలకు చాటేందుకు బజరంగ్‌దళ్ నిరంతరం సంఘర్షణ చేస్తుందన్నారు. ప్రతి బజరంగ్‌దళ్ కార్యకర్త తన మన ధన పూర్వకంగా ధర్మకార్యంలో పాలుపంచుకోవాలని సూచించారు. త్రిశూల్‌దీక్షను సుమారు 600 మంది కార్యకర్తలు పొందారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార్ రాష్ట్ర సహ ప్రముఖ్ సుభాష్ చందర్, బజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రశిక్షణ ప్రముఖ్ ముఖేష్, నాయకులు శ్రీధర్‌గౌడ్, జయరాంరెడ్డి, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో భక్తుల సందడి



మెదక్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రెసిబెటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులతో ప్రత్యేక ప్రార్థన మందిరం కిక్కిరిసింది. చర్చిఆవరణలో ఏర్పాటు చేసిన సిలువ వద్ద కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మత గురువులు భక్తులను ఆశీర్వచనాలందించారు. వేసవి కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి విందు భోజనాలు చేస్తూ సేద తీరారు.

ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారిణి



సాయిసిరిని సన్మానిస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

మనోహరాబాద్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి సాయి సాయిసిరి ఎంపికైనట్లు మెదక్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ నెల 26 నుంచి 31 వరకు తైవాన్ తైపిలో జరిగే పోటీల్లో భారత్ జట్టు తరఫున ఆడనుందన్నారు. ఈ మేరకు సాయిసిరిని మెదక్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ సన్మానించగా, పలువురు అభినందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● నందిని సిధారెడ్డి సహా పలువురు హాజరు
● మరోచోట మంత్రి పొన్నం ప్రభాకర్



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రాయపోల్/హుస్నాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పూర్వ విద్యార్థులు ఏ ఐదేళ్లకో పదేళ్లకో కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. కానీ సిద్దిపేట డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న అర్ధశతాబ్దం తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో 1972 నుంచి 75వ సంవత్సరంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ చదివారు. వారంతా ఆదివారం రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామంలో కుటుంబసమేతంగా కలుసుకొని గత స్మృతులను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ప్రముఖ కవి నందిని సిధారెడ్డి పాల్గొని అందరినీ ఆత్మీయంగా పలకరించారు. వడ్డెపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్ జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆనాటి మధుర స్మృతులను మననం చేసుకున్న మిత్రులు



హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1974-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సవాల మధ్య జరిగింది. 50 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు ఆనాటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు.

పేదల కోసమే విద్య, వైద్య సేవల విస్తరణ

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
● ఏడు అంబులెన్సులు అందజేత



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అంబులెన్స్ వాహనాన్ని అప్పగిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పేదజల కోసమే విద్య, వైద్య సేవలు చేరువ చేస్తున్నట్టు మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు తెలిపారు. సంగారెడ్డిలోని ఐబీలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రభుత్వ ఆస్పత్రులకు ఏడు అంబులెన్సులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ తన జన్మదినోత్సవం సందర్భంగా మొదటి దశలో పరిశ్రమల సహకారంతో అంబులెన్సులు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీఎస్‌ఆర్ నిధులను బయటి నియోజకవర్గాలకు ఇవ్వకుండా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికే ఇచ్చి పార్టీలకతీతంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. అనంతరం సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి ఆస్పత్రులకు కేటాయించిన అంబులెన్సు వాహనాలు, వాటి పత్రాలను ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్ కుమార్, పటాన్‌చెరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్‌రెడ్డి, అరబిందో యాజమాన్యం నిత్యానందారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేశ్‌పాండే, జగన్, డా.రాజుగౌడ్, నాయకులు ద్వారక రవి, నాగరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపీ రఘునందర్‌రావు జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో మాయగాళ్లు

● వసతిగదిలో బంగారు ఆభరణం, నగదు చోరీ

చేర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరివారం జాతరను పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చిన క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు భక్తుల సొమ్ము అపహరించుకుపోయారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం శనివారం రాత్రి ఆలయ పరిధిలోని 44వ వసతి గదిని అద్దెకు తీసుకుని బసచేశారు. ఆదివారం కుటుంబసమేతంగా మల్లన్నను దర్శనం చేసుకుని గదికి చేరుకునేసరికి వెనక భాగం కిటికీ డోరుగుండా బ్యాగును అపహరించుకుపోయారు. అందులో తులం న్నర బంగారు నెక్లెస్, రూ.4,500 నగదు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం ఎమ్మెల్సీ కవిత మల్లన్న దర్శనం కోసం వచ్చిన క్రమంలో రద్దీలో పలువురి నగదు అపహరణకు గురవడంతో లబోదిబోమన్నారు. వరుస సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో మల్లన్న సన్నిధిలో మాయగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక చొరవ వహించాలని భక్తులు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆదివారం జగిత్యాల జిల్లా గొవిందారం గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు ప్రణవ్ జాతరలో తప్పిపోయాడు. బాలుడిని గమనించి పోలీసులు మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేశారు. దీంతో కంట్రోల్‌రూం వద్దకు చేరుకున్న కుటుంబసభ్యులకు బాలుడిని అప్పగించారు.

ఈతవనం దహనం



నంగునూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు పెంచుకున్న ఈతవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన సంఘటన నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని గీత కార్మిక సహకార సంఘానికి సంబంధించిన ఐదు ఎకరాలలో ఈత చెట్లు పెంచారు. చేతికొచ్చే దశలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారుగా 300 చెట్లు దహనమైనట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఈత చెట్లను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని, దహనం చేయడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను దగ్ధం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు స్పందించి ఆదుకోవాలని గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ గౌడ్ కోరారు.

సత్యసాయి ట్రస్టు సేవలు అజరామరం

● సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ శ్వేత

కొండపాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొండపాకలోని సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ రీసర్చ్ సెంటర్ సేవలు ఎంతో గొప్పవని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ ఐపీఎస్ శ్వేత అన్నారు. ఆ ఆసుపత్రిలో ఈ నెల 13 నుంచి 22 వరకు మూడు సెషన్లో 23 చిన్నారులకు గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గిఫ్ట్ ఆఫ్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ఉన్న ప్రాంత అభాగ్యులకు సైతం సత్యసాయి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అనుభూతిని ఆనందాన్ని ఇస్తాయన్నారు. ఆసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ వారిని కాపాడడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధి జగన్నాథ శర్మ, సత్య సాయి బాలికల కళాశాల ప్రతినిధి పూర్ణిమ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న శ్వేత

మహిళా జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో నిర్వహించిన మహిళా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చొరవతో ఆదివారం సిద్దిపేటలోని విపంచి కళానియలంలో జాబ్ మేళాను నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాల కోసం నిర్వహించిన నిర్వహించిన ఈ మేళాకు మహిళలు, యువతులు దాదాపు 500కు పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరై మాట్లాడారు. జీవితం మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందని, ఉద్యోగం పెద్దదా చిన్నదా అనే అనుమానాలు వద్దని, అడుగు బయటకు వస్తే విజయం ఖాయమని స్పష్టం చేశారు. ఆర్థిక స్వాతంత్ర్యంతోనే సమస్యలను ఎదుర్కొనే శక్తి వస్తుందన్నారు. సిద్దిపేటలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ట్రైనింగ్ ఇచ్చినప్పుడు 250 మంది కానిస్టేబుళ్లుగా, 600 మంది డీఎస్సీ, గ్రూప్స్‌లో 33 మంది ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్స్‌గా సుధర్మ అసోసియేట్స్, ప్రతిభ డిగ్రీ కళాశాల వ్యవహరించారు.

జాబ్ రావటం సంతోషంగా ఉంది



నేను సిద్దిపేటలో డిగ్రీ బీబీఏ పూర్తిచేశాను. మహిళా జాబ్‌మేళా ఉందని తెలిసి వచ్చాం. డిగ్రీ పూర్తికాగానే జాబ్ రావడం సంతోషంగా ఉంది. కంపెనీ టర్మ్స్ అండ్ కండీషన్స్ బాగున్నాయి. మొదటిసారి జాబ్ లైఫ్‌లోకి అడుగుపెట్టబోతున్నాం. చాలా ఉత్సాహంగా ఉంది. హరీశ్‌రావు సార్ చెప్పినట్లు చిన్నదా పెద్దదా జాబ్ చేయాలని చెప్పటంతో కాన్ఫిడెన్స్ వచ్చింది.

-లాస్య, సిద్దిపేట

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



రత్నమ్మ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యల కారణంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గూడెం రత్నమ్మ(40) కొడుకు గత ఏడాది క్రితం మరణించాడు. రత్నమ్మ కూడా కొంతకాలంగా అనారోగ్య సమస్యలు బాధపడుతున్నది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం మల్లేపల్లి నుంచి సంగారెడ్డి పట్టణానికి వచ్చి శివారలోని మహబూబ్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాలయ్య(ఫైల్)

పాపన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రం పాపన్నపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బట్టి బాలయ్య (57) పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలం వద్ద బోరు మోటారు పని చేయకపోవడంతో ఆదివారం స్టార్టర్ వద్ద రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. భార్య కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మృతుడు బాలయ్య కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి సభ్యునిగా మృతుడి కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

బావిలోకి జారిపడి..

మద్దూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బావిలోకి జారిపడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగపల్లి నర్సింహులు(47) ఆదివారం తెల్లవారు జామున పొలానికి నీళ్ల పెట్టాడు. బావిలో నీళ్ల ఉన్నాయా లేవా అని తొంగి చూసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీట మునిగి బాలుడు..



దుర్గయ్య మృతదేహం

పాపన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నీట మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కురుమ సాయిలు కుమారుడు దుర్గయ్య(12) శనివారం మధ్యాహ్నం స్నానం చేసేందుకు స్థానిక రెడ్ల చెరువులోకి దిగగా, ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు చుట్టు పక్కల వెతికారు. ఆదివారం చెరువు వద్ద దుర్గయ్య దుస్తులు కనిపించగా, చెరువులో గాలించగా మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..



అరవింద్ మృతదేహం


జగదేవ్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుంటలో చేపల వేట కోసం వెళ్లిన ఓ బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాందాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల వెంకటేశం ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు నరేష్, అరవింద్(17), సంతోష్ ఉన్నారు. అరవింద్ తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ బీసీ హాస్టల్‌లో ఉంటన్నాడు. కాగా ఆదివారం సెలవు దినం కావడంతో అరవింద్ అతని తమ్ముడు సంతోష్ తోపాటు చిన్నాన్న కుమారులైన మరో ఇద్దరితో కలిసి మాందాపూర్‌లోని బతుకమ్మ కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారు. అరవింద్ చేపల కోసం కుంటలోకి దిగడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని అరవింద్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

● భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దంపతులిద్దరు ప్రయాణిస్తున్న బైకుని లారీ ఢీకొన్న ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బ్రహ్మణ బంజేరుపల్లి గ్రామానికి చెందిన సుతారి కిష్టయ్య, సత్తవ్వ దంపతులిద్దరు బైక్‌పై గజ్వేల్ నుంచి కాసులాబాద్‌కు కిష్టయ్య సోదరుడు(అన్న) మృతి చెందగా మూడు రోజుల కార్యక్రమానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో అహ్మదీపూర్ గ్రామ శివారు ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద దంపతులిద్దరు ప్రయాణిస్తున్న బైక్‌ని కొల్గూర్ నుంచి వస్తున్న లారీ ఢీకొట్టి, వారి పైనుంచి వెళ్లడంతో సత్తవ్వ(48) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కిష్టయ్యకు కాళ్లు, చేతులు విరగడంతోపాటు తీవ్ర గాయాలు కాగా మొదట గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. వారికి ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా కూతురి వివాహమైంది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



వ్యక్తి మృతదేహం

జిన్నారం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మరణించిన ఘటన గడ్డపోతారంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డపోతారం గ్రామ శివారులో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో 40ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ప్రైవేటు పరిశ్రమ ఉద్యోగి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల వలయంలో సర్కారు బడి

● మూడేళ్ల క్రితమే కొత్తభవనంలోకి మారిన మర్పడగ ఉన్నత పాఠశాల
● అరకొర వసతులతో తప్పని ఇక్కట్లు
● ప్రహరీ లేక పశువుల సంచారం
● ఆకతాయిలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం
● నత్తనడకన వాష్‌రూమ్ పనులు
● గోతులకే పరిమితమైన కిచన్‌షెడ్



ప్రహరీ లేని మర్పడగ పాఠశాల, వాష్ బేసిన్ నల్లాలను ధ్వంసం చేసిన ఆకతాయిలు

కొండపాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ ఉన్నత పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పాఠశాల పరిస్థితి ఇలా..

మర్పడగ ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏటా పదో తరగతిలో మంచి ఫలితాలతో పురోగతిలో సాగుతోంది. గ్రామంలో పాఠశాల పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితం కొత్త భవనాన్ని నిర్మించారు. అయితే వసతులు మాత్రం అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ శివారులో పొలాల మధ్య ఈ పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయడంతో కొంత భాగం కుంగుబాటుకు గురైంది.

వేసవిలోనైనా పనులు పూర్తయ్యేనా?

పాఠశాలకు మంజూరైన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వాష్‌రూమ్‌లు లేకపోవడంతో విద్యార్థినులు నానా ఇబ్బందులకు పడుతున్నారు. మన ఊరు మనబడి పథకంలో వాష్‌రూమ్‌ల కోసం రూ.90 లక్షలు మంజూరైనప్పటికీ, పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయి. అలాగే మర్పడగ ఉన్నత పాఠశాలకు కిచెన్ షెడ్ కూడా మంజూరైంది. అయితే అది కూడా గోతులు తీసి అర్ధాంతరంగానే నిలిచిపోయింది. వర్షాకాలంలో వర్షపు నీటితో గ్రౌండ్ మొత్తం నిండిపోతుంది. గదుల్లో సైతం వర్షపు నీరు చేరుతుంది. సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఏఏపీసీ చైర్మన్ ఉపాధ్యాయులు అప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. వేసవి సెలవుల్లోనైన పనులు పూర్తి చేసి సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా..

గ్రామ శివారులో నిర్మించిన పాఠశాల భవనానికి కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన హ్యాండ్ వాష్ నల్లాలను ఊడగొడుతున్నారు. గతంలో ఒకసారి నల్లాలన్నింటినీ ధ్వంసం చేయడంతో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో మళ్లీ కొత్త నల్లాలను బిగించారు. ఇటీవల వాటిని సైతం విరగొట్టి వాష్ ఏరియాను ధ్వంసం చేశారు. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణతో పాటు లోపలికి చొరబడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. పాఠశాల ఆవరణలో నిత్యం పశువులు, గొర్రెలు, మేకలు, కుక్కలు సంచరించడంతో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ప్రతిరోజూ ఉదయం శుభ్రం చేయకపోతే దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి కాకతప్పదు.

భగత్‌సింగ్ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

● సిద్దిపేట జిల్లాలో వర్ధంతి


సిద్దిపేటలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు


గజ్వేల్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట అర్బన్/చేర్యాల/దుబ్బాక/మిరుదొడ్డి/జగదేవ్‌పూర్/గజ్వేల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో వివిధ సంఘాలు, యువజనసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. మతోన్మాద శక్తులను ఓడించి దేశ సమైక్యతను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్. విజయేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జి. జానకిరాములు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సిద్దిపేట పట్టణంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ ఐ, ఏబీవీపీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.చేర్యాల మండలకేంద్రంలోని అంగడి బజారులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. అలాగే గుర్జకుంటలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాసమితి సభ్యులు ఈరి భూమయ్య, సహాయకార్యదర్శి సిద్దయ్య, సుదర్శన్, లచ్చయ్య, అజీమ్, జస్వంత్, సిద్దు వర్ధన్ ఉన్నారు. యువ కేంద్రం సభ్యులు పాండు, శ్రీను, బాబు, తిరుపతి, రాయుడు ఉన్నారు. దుబ్బాకలోనీ సీపీఎం పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులను అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ బాల్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, సీపీఐ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా నాయకుడు రంగారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, రాజు, స్వామి, నర్సింలు, అక్షిత్ తదితరులున్నారు.

ఆత్మ కమిటీ గజ్వేల్ చైర్మన్‌గా మద్దూరి మల్లారెడ్డి



గజ్వేల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన మద్దూరి మల్లారెడ్డి నియమితులయ్యారు. మల్లారెడ్డితో పాటు 25మంది డైరెక్టర్లను నియమిస్తూ సిద్దిపేట కలెక్టర్ ఎం. మనూచౌదరి ఉత్తర్వులను విడుదల చేశారు. గజ్వేల్ మండలానికి చెందిన శాతం స్వామి, బూర్గుపల్లి యాదగిరి, సింగిరెడ్డి ప్రణయ, మద్దూరి బాల్‌రెడ్డి, జగ్గారి లత, గజ్వేల్ రాంచంద్రారెడ్డి, పాశం సుదర్శన్‌రెడ్డి, డాకిరెడ్డి బుచ్చిరెడ్డి, పుల్ల మంజుల, కొత్తపేట రాజమణి, మన్నె కృపానందం, సయ్యద్ పాషా, నాయిని భవానీ, మామిడి కృష్ణ, పోల దుర్గయ్య, మానెగల్ల నాగరాజు, బిందె రాజలింగంగౌడ్, రాయపోల్ మండలానికి చెందిన మన్నిషైన భూపతిరావు, దుర్గం జానిగౌడ్, మాదాసు లక్ష్మి, కొండపాక మండలానికి చెందిన ఆకారం సరోజన, దుర్గంపల్లి శ్రావణ్, పబ్బోజు వీరభద్రంలను డైరెక్టర్లుగా నియమించారు. ఈ సందర్భంగా మద్దూరి మల్లారెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్దిపేటలో ఉగాది కవిసమ్మేళనం


ఉగాది సమ్మేళనంలో మాట్లాడుతున్న కవులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సంఘర్షణ లోంచి పెల్లుబికిన భావావేశాన్ని అక్షర రూపంలో వ్యక్తపరిస్తే, అది కవిత్వమవుతుందని ప్రముఖసాహిత్య విమర్శకుడు కస్తూరి మురళీకృష్ణ పేర్కొన్నారు. వెన్నెల సాహితీసంగమం ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట శివానుభవమండపంలో నిర్వహించిన ఉగాది కవిసమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. చక్కనైన కవిత్వాన్ని రాస్తూ తెలుగుసాహిత్యం సగర్వంగా తలెత్తుకుని నిలబడేలా చేయాల్సిన బాధ్యత ఈ తరం కవులపై ఉందన్నారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో 70మంది కవులు కవితాగానం చేశారు. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులకు సొప్పదండి విద్యాసాగర్ సౌజన్యంతో సురవరం ప్రతాపరెడ్డి స్మారక సాహిత్య పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, వంగరనరసింహారెడ్డి, పర్కపెల్లి యాదగిరి, మహమూద్ పాషా, మోరమోహన్, త్రివిక్రమ్‌శర్మ, మహిపాల్, మహేందర్, సుధాకర్, ఉమాశంకర్, పరకాల రవీందర్, శ్రీధర్, సుజాతాప్రసాద్, వనితారాణి, నర్సింలు, ఎడ్లలక్ష్మి, వర్కోలు లక్ష్మయ్య, పెందోట వెంకటేశ్వర్లు, ఎలికట్టె అయిలయ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు

పాదయాత్ర సక్సెస్‌తో బీఆర్ఎస్‌లో వణుకు


గజ్వేల్‌లో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో వణుకు మొదలైందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్సారెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, పాదయాత్ర విజయవంతం కావడంతో తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. నర్సారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఆయన వెంట నాయకులు గుంటుకు శ్రీనివాస్, అజహర్, నాంపల్లి బాబు, ముక్తార్, బాలు, రమేశ్ తదితరులున్నారు.

పదవిని కాపాడుకునేందుకే పాదయాత్ర: బీఆర్ఎస్


గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పదవిని కాపాడుకునేందుకే నర్సారెడ్డి పాదయాత్ర చేస్తున్నారని గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, మండలాధ్యక్షుడు బెండే మధు, కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, నాయకులు జుబెర్, రమేశ్, బొగ్గుల చందు విలేకరులతో మాట్లాడారు. నర్సారెడ్డి పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఇవ్వకపోవడం, కొండపాక మండల రైతులకు నీటిని ఇవ్వకపోవడం తదితర సమస్యలపై పాదయాత్ర చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజల కష్టసుఖాల్లో అండగా, భరోసాగా నిలుస్తున్న వ్యక్తి ప్రతాప్‌రెడ్డి అని, రూ. 10వేల కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావులకే దక్కుతుందన్నారు. నర్సారెడ్డికి దమ్ముంటే అభివృద్ధికి నిధులు తీసుకురావాలని సవాల్ విసిరారు.

అల్వాల్‌లో తూంకుంట ఆంక్షారెడ్డికి ఘన స్వాగతం

అల్వాల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి 15 నెలలు గడుస్తున్నా నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ తాను గజ్వేల్ నుంచి పాదయాత్ర చేపట్టినట్టు కాంగ్రెస్ మహిళా నాయకురాలు తూంకుంట అంక్షారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె పాదయాత్ర హైదరాబాద్‌లోని అల్వాల్, లోతుకుంటకు చేరుకున్నది. ఆమెకు తెలంగాణ సాంస్కృతిక మండలి చైర్మన్ వెన్నెలగద్దర్, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అంక్షారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదగాలి

నంగునూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆత్మ రాములు పేర్కొన్నారు. ఆదివారం నంగునూరులో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి కొండా సురేఖ, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ప్రభాకర్, నర్సారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇటీవల ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామినేషన్స్(ఏబీఈ) లో ఉత్తీర్ణత సాధించిన కారంపూరి రాజేష్‌ను పద్మశాలీసంఘం సభ్యులు అభినందిస్తూ సన్మానం చేశారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయసమావేశంలో పూర్వ విద్యార్థులు

చేర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ జడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన 1989-90 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనాన్ని ఆదివారం స్థానిక వివేకానందగార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ గురువులను సత్కరించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆడిపాడారు.

త్రిశతి పుస్తకావిష్కరణ


త్రిశతి ఆవిష్కరణ చేస్తున్న డీఐఈవో రవీందర్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత, సాహితీ విమర్శకుడు డా. ఎస్.ఎస్.రాజు రచించిన వెల్లి రావయ్య శుభకరా వేడ్కమీర త్రిశతి పుస్తకాన్ని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. సమాజ హితాన్ని కాంక్షించే కవిత్వం కలకాలం నిలిచి ఉంటుందని, అలాంటి కవిత్వాన్ని రాయాలని డీఐఈవో సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, చెన్నూరి శ్రీనివాస్, దేవస్వామి, గంగాధర్, శ్రీనివాస్, రాజమౌళి, సుమన్, శ్రీలీల, వెంకటేష్, చంద్రమోహన్, కనక చంద్రం, దరిపల్లి నగేష్ పాల్గొన్నారు.

ఒగ్గు కథా యువసామ్రాట్ సారయ్యకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రాగుల సారయ్య

మద్దూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన ఒగ్గు కథా యువసామ్రాట్ రాగుల సారయ్య డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రం పాండిచేరిలోని ఫైన్ బాగ్ కన్వెన్షన్ హాలులో యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ సౌజన్యంలో ఆదివారం నిర్వహించిన 2025 అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంతమైన లద్నూరు నుంచి డిల్లీ దాకా సారయ్య అనేక వేదికలతో పాటు అంతర్జాతీయ వేదికలపై వినిపించిన ఒగ్గు కథ ఎంతోమందిని మంత్రముగ్ధులను చేసింది. గత 30 యేళ్లుగా భాగవతం నుంచి ఒగ్గు కథనే జీవనాధారంగా చేసుకుని సారయ్య కంఠం నుంచి వినసొంపుగా మైమరింపజేసే మల్లన్న పట్నాలు, బీరప్ప, ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ఎర్ర పోచమ్మ, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, పెద్దిరాజు పెద్దమ్మ, వరదచ్చ మల్లన్న, అపురూపవతి, సారంగధర, కాంతామతి, కనకతార, నల దమయంతి, శ్రీమాన్ దాత, కీలుగుర్రం, అమరశీల, రంభరంపాన, శివకుమార, ఐదు మల్లెపూలు, బాలనాగమ్మ, వంటి కథలు అతడిని ఆకాశానికెత్తాయి. డాక్టరేట్ అందుకున్న సారయ్యను గ్రామస్థులు అభినందించారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు ప్రశంసాపత్రాలు


ఎంపీ రఘునందన్‌రావు చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు.

కుకునూరుపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టాలెంట్ టెస్ట్ పరీక్షలలో ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎంపీ రఘునందన్‌రావు మెమొంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆదివారం ఎంపీ జన్మదినం సందర్భంగా ఎంఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం, శనివారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని కోంపల్లి నివాసంలో ఎంపీ రఘునందన్‌రావు విద్యార్థులకు మెమొంటోలు మరియు ప్రశంసాపత్రాలు అందజేసి వారిని సన్మానించారు.సంపత్‌రెడ్డి, మనోహర్‌యాదవ్, సదానందగౌడ్, నాగరాజు, రమేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని క్యాసారంలో పేకాట స్థావరంపై గజ్వేల్ పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుంచి రూ.23,430 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

గోపా జిల్లా కన్వీనర్‌గా వంశీకృష్ణాగౌడ్

దుబ్బాక, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గౌడ్ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (గోపా) జిల్లా కన్వీనర్‌గా న్యాయవాది పల్లె వంశీకృష్ణాగౌడ్‌ను నియమిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయన్నగౌడ్ ఆదివారం తెలిపారు. గోపా కన్వీనర్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రతీ కార్యక్రమంలో ముందుండి పనిచేస్తామన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



చేర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంకు నుంచి మిషన్‌భగీరథ నీళ్లు ఆదివారం అరగంటకు పైగా వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఓ వైపు దాహార్తి కోసం స్థానికులు అల్లాడుతుండగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న పల్లా

దూళిమిట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతున్న హనుమతండా గ్రామ మాజీ సర్పంచ్ రేణుక భర్త జాటోత్ కల్రాంను ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు మంద యాదగిరి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో జీవితాలు ఛిద్రం

● దక్షిణాది రాష్ట్రాల మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఉమాశంకర్


లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యనిపుణులు

ములుగు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితాలను మాదకద్రవ్యాలు, ఆన్లైన్ బెట్టింగ్ చిన్నాభిన్నం చేస్తున్నట్లు దక్షిణాది రాష్ట్రాల మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఉమాశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా లక్ష్మక్కపల్లి ఆర్వీఎం మెడికల్ కళాశాల వద్ద మానసిక వైద్యుల సంఘం, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు రాష్ట్రశాఖ అధ్యక్షుడు అశోక్ చందాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసై యువత పక్కదారి పడుతుండడం దురదృష్టకరమన్నారు. ప్రాథమికస్థాయి నుంచే అవగాహన కలిగిస్తూ వాటి బారిన పడకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇందుకోసం కఠిన చట్టాలు రూపొందించాలని కోరారు. శిక్షణ పొందుతున్న మానసిక వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఈ అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువ మానసిక వైద్యుల సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించేందుకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య, ఒరిస్సా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సామ్రాట్ కర్, ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ ఎర్ర శ్రీధర్, డాక్టర్ జార్జిరెడ్డి, డాక్టర్ ఆకుల విశాల్, డాక్టర్ పోరండ్ల కిషన్, డాక్టర్ మన్మోహన్‌రాజ్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ అనిత, డాక్టర్ ఫణికాంత్, డాక్టర్ శరణ్య, సీఈవో దేవరకొండ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలి

● సిద్దిపేటలో పలు కార్యక్రమాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని ప్లెక్సీని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, ఇఫ్తార్ విందులో ముస్లింలు

సిద్దిపేట క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ కు యువత దూరంగా ఉండాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను నిషేధించాలని సిద్దిపేటలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ప్లెక్సీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో కేసీఆర్ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్స్‌ను నిషేధించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎంతోమంది బెట్టింగ్ యాప్స్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈవిషయంలో కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిద్దిపేట పట్టణం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు రమేష్, లత కూతురుకు గుండె సమస్య రాగా వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. బాధిత కుటుంబం మాజీ మంత్రి హరీశ్‌రావును ఆశ్రయించగా సీఎంఆర్ఎఫ్ కింద రూ.2లక్షల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేయించి ఆదివారం వారికి అందజేశారు.

● సిద్దిపేట కల్చరల్: సిద్దిపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి హరీశ్‌రావు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు దర్గాలో హరీశ్‌రావు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ మదన్మోహన్, కేసీఆర్ నాటి నుంచి నేటి వరకు సిద్దిపేటలో గంగ జమున తహజీబ్ కొనసాగుతుందన్నారు. అలాగే సిద్దిపేట పట్టణంలోని కొలువైయున్న శ్రీ పెద్దమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం, శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ 49వ వార్షికోత్సవాల సందర్భంగా అమ్మవార్లను మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, ముదిరాజ్, గౌడ సంఘం ప్రతినిధులు హరీశ్‌రావును సన్మానించారు. అదేవిధంగా సిద్దిపేటలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు హరీశ్‌ను సత్కరించారు.

● సిద్దిపేట రూరల్: అమరవీరుల స్థూపం, గ్రామ స్వాగత తోరణం నిర్మాణంతో తోర్నాల గ్రామానికి పూర్వవైభవం వస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలో పీపుల్స్‌వార్ అమరవీరుల స్మారక స్తూపం పునర్నిర్మాణానికి, గ్రామ స్వాగతతోరణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఇంద్రగూడెం గ్రామంలో బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పరమేశ్వర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లికి నీళ్లొచ్చేనా!?

(5వ పేజీ తరువాయి)

పొలాల కోతకయ్యే ఖర్చు భరించే పరిస్థితిలేక రైతులు పశువులకు మేతగా మార్చుకున్నారు. ఏ గ్రామంలో చూసినా ఎండిన పొలాలే దర్శనమిస్తున్నాయి. కాస్త మెరుగ్గా ఉన్న ఒక్కమడినైనా కాపాడుకునేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పరిహారంకోసం ఆందోళనలు.. వినతులు

పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో వెంటనే దేవాదుల పంపింగ్ చేపట్టాలని, ఎండిన పంటల నష్టం అంచనావేసి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు నిత్యం ఓ చోట ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. కానీ ఆయా ఆందోళనలు విరమించడానికి, ప్రజాప్రతినిధులు, నేతలు ఎప్పుడు మాట్లాడినా వారంలోగా పంపింగ్ చేస్తామని దేవాదుల అధికారులు చెప్పి రోజులు గడిచినా చుక్కనీరు విడుదల చేయలేదు. త్వరలో చేస్తారన్న ఆశకూడా వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆయా పరిణామాల నేపథ్యంలో పార్టీలకతీతంగా ఆందోళనల కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తుండటంతో ఇటు ప్రభుత్వం, అటు దేవాదుల అధికారులు పంపింగ్ ప్రారంభిస్తారా... రైతాంగానికి ఊరట కలిగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాలి.